క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఏలీఫ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సమ్మయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఏలీఫ్ పారిశ్రామిక వాడ, వాసవీ లేఅవుట్, బచ్‌పన్ స్కూల్, ప్రగతి స్కూల్ 410 డీటీఆర్, హెచ్‌డీఎస్‌పీ బ్యాంక్ వెనుక, మోర్ సూపర్ మార్కెట్, న్యూ విజేత సూపర్ మార్కెట్, కరూర్ వైశ్య బ్యాంక్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

◆ 11కేవీ శ్రీనివాస కాలనీ ఫీడర్ పరిధిలోని కేటీఆర్ కాలనీ, బాలాజీ మిడోస్, శ్రీనివాస్ హౌసింగ్ సొసైటీ ప్రాంతాల్లో, అదే విధంగా 11కేవీ కేఎస్‌ఆర్ ఫీడర్ పరిధిలో విజ్ఞాన్ స్కూల్ రోడ్డు, కొలన్ నారాయణరెడ్డి కాలనీ, గ్రాయత్రి టవర్స్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం



భవానీనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ రావుల శేషగిరి, డీసీ ప్రశాంతి

సుభాష్‌నగర్: ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. గురువారం గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతితో కలిసి ఆయన భవానినగర్‌లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి డ్రైనేజీ, రోడ్లు తదితర సమస్యలు వారి దృష్టికి వచ్చాయి. ఈ సమస్యనలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీవాసులు నవాబ్, గోపాలకృష్ణ, దేవేందర్ గౌడ్, మణికుమార్, నర్సింగ్ రావు, మోహన్ రావు, పాండు, పూర్ణచంద్రరావు, నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

జగద్గిరిగుట్ట: సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి మెరుగైన సేవలు పొందాలని జగద్గిరిగుట్ట సబ్ స్టేషన్ ఏఈ రాధాకిషన్ ఓ ప్రకటనలో కోరారు. 21న శివ నగర్‌కమ్యూనిటీ హాల్, 22న మగ్దూంనగర్ గణేష్ మండపం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్లలో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.

కేటీఆర్‌కాలనీ పార్కు అభివృద్ధి చేయాలి



ఇన్‌చార్జ్ కమిషనర్ వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని కేటీఆర్ కాలనీ పార్కు అభివృద్ధి చేయాలని కార్పొరేటర్ రవికిరణ్ కోరారు. ఈ మేరకు యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ ప్రతినిధులు బుధవారం ఇన్‌చార్జ్ కమిషనర్ రామకృష్ణారావును కలిసి వినతి పత్రం అందజేశారు. పార్కు సమగ్రాభివృద్ధికి అనుమతిస్తే పనులు చేపడతామన్నారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డి, ఆవుల జగన్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

ఆటోడ్రైవర్ ఫోన్ తీసుకుని పరార్

జీడిమెట్ల: ఓ దొంగ మాయమాటలు చెప్పి ఆటో డ్రైవర్ సెల్‌ఫోన్ తీసుకుని పరారైన సంఘటన జీడిమెట్ల పీఎస్‌పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి తండాకు చెందిన శ్రీను గురువారం పని నిమిత్తం తన గూడ్స్ ఆటోలో బాలానగర్ వచ్చాడు. తిరుగు ప్రయాణంలో శ్రీను షాపూర్‌నగర్ ఉషోదయ టవర్ వద్దకు చెరుకోగానే ఓ వ్యక్తి ఆటోను ఆపాలని కోరాడు. శ్రీను ఆటోను రోడ్డు పక్కన నిలిపాడు. రెండు బస్తాల బియ్యం సంచులు గండిమైసమ్మ వరకు తీసుకువెళ్లాలని శ్రీనుతో అన్నాడు. అనంతరం శ్రీనును నమ్మించి సాయి దర్శిని హోటల్ వద్దకు తీసుకువచ్చాడు. సదరు దొంగ బస్తాలు వేసే ముందు కింద ఖాళీ సంచి వేయమని శ్రీనుకు ఇవ్వగా ఇది నమ్మిన ఆటో డ్రైవర్ శ్రీను సరే అన్నాడు. అనంతరం సదరు దొంగ ఒక్క ఫోన్‌కాల్ చేసుకుంటాను అని శ్రీనును సెల్‌ఫోన్ అడగగా శ్రీను అతనికి ఫోన్ ఇచ్చి ఆటోలో సంచి పరవడానికి వెళ్లాడు. ఇంతలో సదరు దొంగ అక్కడ నుంచి పరుగున తప్పించుకున్నాడు. 5 నిమిషాలు అక్కడే చేచి చూసిన శ్రీను తన ఫోన్‌ను దొంగ ప్లాన్‌తో తస్కరించాడని తెలుసుకుని జీడిమెట్ల పోలీసులకు పిర్యాదు చేశాడు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

- ఎమ్మెల్యే వివేకానంద్
- పట్టాల విషయంపై తహసీల్దార్‌తో సమావేశం
- జొన్నబండలో సర్వే చేపట్టి ఇస్తామని వెల్లడి



వినాయకనగర్‌లో పేదలకు ఇళ్ల పట్టాల విషయమై తహసీల్దార్‌తో సమావేశమైన ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు అందజేస్తామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్ (జొన్న బండ)లో ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాల విషయమై గురువారం ఎమ్మెల్యే స్థానిక తహసీల్దార్ సంజీవరావు గారితో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు ఇబ్బందులు లేకుండా సర్వే చేపట్టి అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు అందించి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పేట్‌బషీరాబాద్ ఎస్సై రామకృష్ణ, వార్డు మెంబర్ ఇందిరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రగతియాత్రలో అభివృద్ధి పనుల పరిశీలన..

ప్రగతియాత్రలో భాగంగా గురువారం సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని వెంకటాద్రినగర్, శ్రీరామ లేఅవుట్, వాసు లేఅవుట్, కృష్ణారావు లే అవుట్, సుభాష్‌నగర్ లాస్ట్‌బస్టాప్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికంగా జరుగుతున్న డ్రైనేజీ, ఎస్‌ఎన్‌డీపీ నాలా, రోడ్ల నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ కృష్ణ చైతన్య, డీఈఈ పాపమ్మ, నరేందర్, ఏఈలు రామారావు, సురేందర్ నాయక్, మేనేజర్ రాజు, మాజీ కౌన్సిలర్ రంగారావు, డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు పోలె శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం..

జీడిమెట్ల డివిజన్ భౌద్దనగర్‌లోని సాయి సన్నిధానం 6వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. చింతల్ డివిజన్ చంద్రానగర్‌లో వార్డు సభ్యురాలు మెహరున్నీసా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, డేగ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

41మందకి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ..

సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన 41 మంది లబ్ధిదారులకు రూ.18.63,000 విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి



తహసీల్దార్ సంజీవరావుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని సీపీఐ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ సంజీవరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. మండల పరిధిలోని సర్వే నం .181, 79, 329, 342, 326, 307, 348/1లలోని ప్రభుత్వ భూమిలో వెలిసిన అక్రమ నిర్మాణాలను గత కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు తొలగిస్తామన్నారు. కానీ ఇంత వరకు తొలగించక పోవడంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారని అన్నారు. కబ్జాదారులు జీవో నం.58 కింద తప్పుడు పత్రాలను సృష్టించి దరఖాస్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ సర్వే నంబర్లలో చేసుకున్నవారికి పట్టాలు ఇవ్వొద్దని కోరారు. ఒకవేళ ఇస్తే సీపీఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని అన్నారు. పరికి చెరువు, రామారం, లాలసాహెబ్ గూడ, చిన్న కుంట, పాక్స్ సాగర్‌లతో పాటు పలు కుంటలను మట్టితో పూడుస్తూ నిర్మాణాలు చేస్తున్నారని లేఖలో తెలిపారు. అలాంటి వాటిని రక్షించి భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏసురత్నం, ఉమామహేష్, హరినాథ్‌రావు, సదానంద్ పాల్గొన్నారు.

కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే నీరు ఎక్కువ తాగాలి



అవగాహన కార్యక్రమంలో భాగంగా బుట్టల్లో బంతులను వేస్తున్న దృశ్యం

నిజాంపేట్: ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాచుపల్లిలోని ఎస్‌ఎల్‌జీ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం కాలేయంపై అవగాహన కల్పించేందుకు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధాన కూడళ్లల్లోని ఖాళీ ప్రదేశంలో రెండు బుట్టలు పెట్టి, వాటిలో ఒకదాని పక్కన మంచినీళ్ల సీసా బొమ్మ, మరోదాని పక్కన మద్యం సీసా బొమ్మను ఏర్పాటు చేశారు. మీ కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే ఏం తాగుతారు అన్న ప్రశ్నతో.. అక్కడ ఉన్న బుట్టల్లో ఏదో ఒక దాంట్లోకి దూరం నుంచి బంతులు వేయాల్సిందిగా స్థానికంగా ఉండే ప్రజలకు సూచిస్తున్నారు. తద్వారామద్యం తాగితే కాలేయం పాడైపోతుందని, కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే ఎక్కువగా మంచినీళ్లు తాగాలని ఒక అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని గోకరాజు రంగరాజు కాలేజీ, బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్, మయూరి కాలనీల్లో ఈ తరహా అవగాహన కార్యక్రమాలు చేపట్టగా స్థానికుల నుంచి విశేష స్పందన లభించిందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి





మాట్లాడుతున్న బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు. చిత్రంలో ఏసీపీ చంద్రశేఖర్, సీఐ నర్సింగ్‌రావు పాల్గొన్న అవినాష్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

భాగ్యనగర్‌కాలనీ: కంటికి కనిపించని మోసగాళ్లతో జాగ్రత్త ఉండాలని.. ప్రతి ఒక్క పౌరుడు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం కూకట్‌పల్లి ఎస్‌కెఎస్‌ఆర్ గార్డెన్‌లో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రోజుకు వేలల్లో సైబర్ నేరాలు జరుగుతున్నాయని అన్నారు. సైబర్ మోసగాళ్లు మన కళ్లుకప్పి రాజ్యమేలుతున్నారు. వారి పట్ల అప్రమత్తంగా ఉండకపోతే అంతే సంగతులు అని పేర్కొన్నారు. గతంలో తెలిసిన వారే రకరకాలుగా మోసం చేయటమే గమనించామని తెలిపారు.

◆ ప్రస్తుతం ఆన్‌లైన్‌లో తమకు తెలిసిన వారు కానప్పటికి వారి నుంచి కూడా మనము మోసపోతున్నామని పేర్కొన్నారు. ఆన్‌లైన్ మోసాలకు తెరలేపి అందిన కాడికి దోచుకుంటున్నారు.

◆ వీటిని అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండటమే కాకుండా వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. తమకు తెలిసిన వారికి కూడా సైబర్ నేరాలపై తెలియపర్చాలన్నారు. సైబర్ నేరాలు అరికట్టడంలో యువత నడుం బిగించాలని సూచించారు. స్టాలిన్ సినిమాలో హీరో చూపించినట్లు ఒకరికి తెలిస్తే మరో ముగ్గురికి చెప్పాలి అనే విధంగా ఈ సైబర్ నేరాల పట్ల అదే తరహాలో అవగాహన కల్పిస్తే తప్ప సైబర్ నేరాలు అరికట్టలేమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీపీ చంద్రశేఖర్, కూకట్‌పల్లి సీఐ నర్సింగ్‌రావు, ఎస్సైలు శంకర్, రామకృష్ణ, ప్రేమ్‌సాగర్, సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రతినిధి భానుమూర్తి, దిల్‌సే వలంటీర్ సుప్రియ, అవినాష్ కళాశాల ప్రొఫెసర్ అఖిల, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు ఓయూకు విద్యాశాఖ మంత్రి రాక

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు నేడు (21న) రాష్ట్ర విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి రానున్నారు. యూనివర్సిటీలో ఏర్పాటు చేయనున్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండో–పసిఫిక్ స్టడీస్ ప్రారంభానికి దూరవిద్య కేంద్రంలో జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ఓయూ అధికారులతో పాటు రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, ఎమ్మెల్సీ సురభివాణీదేవి హాజరవుతారన్నారు.

ఫీజుల పెంపుపై కరపత్రం విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ కోర్సుల ట్యూషన్ ఫీజు పెంపు పై విద్యార్థులు నిరసన చేపట్టారు. పెంచిన ఫీజును తగ్గించాలని దేశంలోని వివిధ వర్సిటీల్లో అమలవుతున్న ఫీజుల వివరాలతో రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ.. ఐదేళ్లలో కేవలం 48 రోజుల నామా మాత్రపు తరగతి గది బోధనకు రూ.20 వేల నుంచి రూ.1.20 లక్షలకు ట్యూషన్ ఫీజును పెంచడం దారుణమన్నారు. పెంచిన ఫీజును తగ్గించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సత్య, ఆజాద్, రవినాయక్, మహేష్, కిరణ్, గోవర్ధన్, రవి, వెంకట్ పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ పొలిటికల్ సైన్స్ విభాగంలో సామాజిక అంశాలపై గురువారం సదస్సు జరిగింది. దేశంలో మారుతున్న సామాజిక సాంస్కృతిక ప్రకృతి దృశ్యం అనే అంశం పై జరిగిన సదస్సు హెడ్ ప్రొ.చంద్రునాయక్ అధ్యక్షత వహించగా బీబీసీ తెలుగు ఎడిటర్ జీఎస్ రామ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సామాజిక సమస్యలు రాజకీయ అంశాలతో ఎలా ముడిపడి పాలన కొనసాగుతుందో వివరించారు.

ఫీజుల పెంపుపై ఏబీవీపీ ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో వివిధ కోర్సులు, పరీక్ష ఫీజుల పెంపు పై ఏబీవీపీ ఆధ్వ ర్యంలో ధర్నా చేపట్టారు. గురువారం ఏబీవీపీ ఓయూ అధ్యక్షులు అశోక్, కార్యదర్శి పరుశురాం ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని భవనం ఎదుట బైఠాయించి డిగ్రీ కోర్సుల సెమిస్టర్ పరీక్షల ఫీజు, పీ హెచ్‌డీ ట్యూషన్ ఫీజు తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం వీసీ కార్యాలయంలోకి చొ చ్చుకు వెళ్లేందుకు గేటుపై నుంచి దూకేందుకు య త్నించగా పోలీసులు అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో హరిప్రసాద్, జీవన్, రాజు, శ్రీధర్, కైలాష్, ప్ర శాంత్, వికాస్,భాను, గణేష్, రాహుల్, జినిత్, సాయి, శ్రుతి, సంజన, ప్రియ, గంగారాం పాల్గొన్నారు.

రేపటి నుంచి చిన్నారులకు ఆధార్ నమోదు

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఆదర్శనగర్ కమ్యూనిటీహాల్‌లో 5 సంవత్సరాల చిన్నారులకు ఆధార్ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు పిల్లల జనన ధ్రువీకరణ పత్రం, తల్లి లేదా తండ్రి ఆధార్ లింక్ మొబైల్ నంబర్, కరెంట్ బిల్లును తీసుకువచ్చి నమోదు చేసుకోవాలని సూచించారు. పిల్లల జనన ధ్రువీకరణ పత్రం లేని పక్షంలో సర్కిల్ కార్యాలయానికి వెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. 0–5 సంవత్సరాల పిల్లలకు మాత్రమే ఆధార్ నమోదు జరుగుతుందని పేర్కొన్నారు.

సమ్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు

దుండిగల్: ప్రజా సమన్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ బస్తీలు, కాలనీలకు చెందిన ప్రజలు గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చి వినతి పత్రాలు అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన శంభీపూర్ రాజు ఆయా శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

24 నుంచి వేసవి శిక్షణా తరగతులు

నిజాంపేట్: ప్రగతినగర్‌కు చెందిన సద్గురు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో ఎల్‌కేజీ నుంచి ఆపై తరగతుల విద్యార్థులకు చిత్రలేఖనంలో వేసవి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు సత్యవోలు రాంబాబు ఓ ప్రకటనలో తెలియజేశారు. తైలవర్ణ చిత్రం , నీటివర్ణ చిత్రం, ఆక్రిలిక్ కలర్ చిత్రం, ఫాబ్రిక్ పెయింటింగ్, డ్రాయింగ్, పొట్రెట్ డ్రాయింగ్, ఆబ్జెక్టివ్ డ్రాయింగ్, అనాటమి డ్రాయింగ్, పర్స్పెక్టివ్ డ్రాయింగ్, పోట్రెట్ పెయింటింగ్‌లలో ఈ నెల 24నుండి మే 20వ తేదీ వరకు శిక్షణా తరగతులు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారికి పెయింటింగ్‌లో ఒక వారం రోజుల పాటు వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ నం.99599 71679 / 98494 90663.

కాళికాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న కాళికాదేవి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి నెల అమావాస్య రోజు జరిగే ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చన అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామిరెడ్డినగర్‌లోని స్విచ్ గేర్స్ అండ్ స్టక్చరల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సమీపంలో గురువారం ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించగా సదరు వ్యక్తి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. అతడి పూర్తి వివరాలు తెలియరాలేదని పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిజాంపేట్ కార్పొరేషన్‌లో చెత్త సమస్యను పరిష్కరించాలి



నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ప్రతిరోజు వెలువడుతున్న చెత్తను శాస్త్రీయపద్ధతితో రీసైక్లింగ్ చేసి డంపింగ్‌యార్డులో పేరుకుపోతున్న చెత్త సమస్యను పరిష్కరించాలని కార్పొషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. గురువారం బీజేపీ నాయకులు ఇన్‌చార్జ్ కమిషనర్ రామకృష్ణరావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ... ప్రతిరోజు నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో 160 టన్నుల చెత్తను సేకరిస్తున్నా ఇప్పటి వరకు శాస్త్రీయ పద్ధతిలో రిసైక్లింగ్ చేయడం లేదన్నారు. బాచుపల్లిలోని జనవాసాలకు సమీపంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును జనవాసాలకు దూరంగా ఉన్న సర్వే నం.384, 285లకు తరలించాలని కోరారు. ఇప్పటి వరకు జవహర్‌నగర్‌లోని డంపింగ్ కేంద్రానికి చెత్తను తరలించడానికి రూ. 11.72 కోట్ల నిధులను వెచ్చించారని తెలిపారు. 200 టన్నుల కెపాసిటీ ఎంఎస్‌డబ్ల్యూను ఏర్పాటు చేసుకుంటే ప్రజాధనం వృథా కాదన్నారు. పొడి, తడి చెత్త వేరు చేయడానికి రూ.1.20 కోట్ల నిధులు వెచ్చించారని తెలిపారు. ఇప్పటికైన అధికారులు ప్రజాధనం దుబారా కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భిక్షపతి యాదవ్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు అశోక్‌నాయక్, కిషన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ రాజు, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు కుమార్‌గౌడ్, వివిధ కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్పలో సమస్యలపై ఆరా



నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పలో సమస్యలు తెలుసుకుంటున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: నిజాంపేట్ బీఆర్‌ఎస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం రాజీవ్‌గృహకల్పలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరగా శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత సూపర్‌వైజర్ లిమెండర్‌తో మాట్లాడారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా స్థానికులకు టోపీలను అందజేశారు. అదే విధంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజీవ్‌గృహకల్పకు చెందిన తన అభిమాని సాకీర్‌ను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమాలలో 33వ వార్డు ప్రెసిడెంట్ అరిగే ముత్యాలు, నర్సింహ, చంద్రయ్య, సుదర్శన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడు సమాజ సేవలో పాలుపంచుకోవాలి



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్

కుత్బుల్లాపూర్: వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహద పడతాయని జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ అన్నారు. గురువారం జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతానికి చెందిన హమాలీ కార్మికులు షాపూర్‌నగర్‌లోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు సమాజ సేవలో పాలుపంచుకోవాలని, అదే విధంగా ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని, వాహనదారులు మద్యం సేవించరాదని, హెల్మెట్‌లు ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, సీపీఐ మండల కార్యదర్శి ఉమా మహేష్ ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు స్వామి, దేవదానం, హరినాథ్, అంజయ్య, సుంకిరెడ్డి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఎడ్యుకేషనల్ రాక్‌స్టార్ సర్టిఫికెట్లు



ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మేడ్చల్ డీఈఓ విజయకుమారి

కుత్బుల్లాపూర్: భారతి ఫౌండేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో గత నెల 16న ఆన్‌లైన్‌లో ఎడ్యుకేషనల్ రాక్‌స్టార్ పోటీలు నిర్వహించారు. మేడ్చల్ జిల్లాలోని 16 ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొనగా జీడిమెట్ల జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎమ్.స్వరూప్ బాబు ప్రథమ స్థానంలో, జడ్పీహెచ్‌ఎస్ బౌరంపేట్ పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయిని కె.రేణుక ద్వితీయ స్థానం, జెడ్పీహెచ్‌ఎస్ (బాలికల) అల్వాల్ సాంఘిక శాస్త్రఉపాధ్యాయురాలు సునీత తృతీయ స్థానంలో నిలిచి టీచర్ ఇన్నోవేషన్ రా స్టార్ అవార్డులను గెలుచుకున్నారు. విజేతలకు మేడ్చల్ జిల్లావిద్యా శాఖాధికారి విజయ కుమారి బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌జీహెచ్‌ఎంఏ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రాంరెడ్డి, భారతి ఫౌండేషన్ ప్రతినిధులు సతీశ్ కుమార్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత



శ్రీశైలంగౌడ్‌ను సత్కరిస్తున్న వాసవీ సేవా సమితి సభ్యులు



ఆలయం వద్ద అన్నదానం ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

జగద్గిరిగుట్ట: జగద్గిరినగర్‌లోని శ్రీ దుర్గామాత ఆలయ ప్రాంగణంలో శ్రీ వాసవీ సేవా సమితి ఆధ్వర్యంలో అమావాస్యను పురస్కరించుకుని గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసవీ సేవా సమితి సభ్యులు శ్రీశైలం గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అమ్మవారి చల్లని చూపు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవీ సేవా సమితి చైర్మన్ ఉప్పల రమేష్‌గుప్తా, బీజేపీ ఓబీసీ మోర్చా నాయకుడు జేకే శేఖర్ యాదవ్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పున్నా రెడ్డి, నాయకులు మేకల సురేష్‌రెడ్డి, వసుంధర, అరుణ్, అరుణారెడ్డి, పరశురామ్, పడాల సత్యనారాయణ, ముప్పిడి రవి, మాధవులు, వాసవి సేవా కమిటీ సభ్యులు బీరెల్లి చంద్రశేఖర్, ఉపేందర్, రవికుమార్, శివ శంకర్, ఆంజనేయులు, ప్రభాకర్, స్వదేశ్ బాబు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.